కిడ్నీ బాధితులకు టిడ్కో చైర్మన్ పరామర్శ

పార్వతీపురంరూరల్ : మండలంలోని పెదమరికి పంచాయతీలో కిడ్నీవ్యాధితో బాధపడుతున్న రోగులను ఎపి టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ బుధవారం పరామర్శించారు. అనారోగ్యంతో ఇటీవల మాజీ సర్పంచ్ భర్త రాజారావు మృతి చెందడంతో ప్రగాఢ సానుభూతి తెలియపరుస్తూ వారి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. ఇదే గ్రామంలో ఇటీవల కాలంలో చాలా మంది కిడ్నీ సంబంధిత వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురవ్వడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ప్రజలు వినియోగిస్తున్న తాగునీటిని సేకరించి పరీక్షల నిమిత్తం విశాఖ రీజినల్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీకి పంపించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, శాశ్వత పరిష్కారం చేస్తామని, ఏ ఒక్కరూ ఆందోళనకు గురికావద్దని హామీ ఇచ్చారు. ఆయన వెంట కృష్ణపల్లి సర్పంచ్ బోను రామునాయుడు, సర్పంచ్ రాజు, గుంపస్వామి, పకీరునాయుడు, ముఖ్య స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల్లో గుబులు

- ఇంటింటికీ వెళ్లకపోతే చర్యలు
- తప్పవంటున్న వైసిపి అధినేత జగన్
- ముగ్గురి పనితీరు బెటర్
- అప్పలనర్సయ్య సహా మరో ఇద్దరి స్థితి అధ్వానం
- మధ్యస్థంగా మరో ముగ్గురు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వైసిపి అధినేత, సిఎం జగన్మోహన్‌రెడ్డి పార్టీ సమీక్షలో తీసుకున్న నిర్ణయం ఎమ్మెల్యేల్లో గుబులు పుట్టిస్తోంది. ఎన్నికల సమయం సమీపిస్తున్న కొద్దీ పార్టీలో తీసుకున్న నిర్ణయాలపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తూ హెచ్చరిస్తున్న విషయం విదితమే. 'గడపగడపకు మన ప్రభుత్వం' అనే కార్యక్రమంపై తాజాగా చేసిన సమీక్షలో రాష్ట్ర వ్యాప్తంగా 20 మంది ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేదని స్పష్టం చేశారు. వారిలో గజపతినగరం ఎమ్మెల్యే పేరు కూడా వినిపించడం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఆయన వ్యాపారాలు, వ్యక్తిగత పనులకు ఇస్తున్న ప్రాధాన్యత పాలనకు, పార్టీకి ఇవ్వడం లేదనే నివేదిక హైకమాండ్‌కు వెళ్లినట్టుగా రాజకీయ నాయకుల్లో చర్చ నడుస్తోంది. గతంలో పలువురు మంత్రులతోపాటు బొత్స సత్యనారాయణ ను కూడా సిఎం హెచ్చరించారు. ఆ తరువాత నియోజకవర్గంలో కొంత హడావుడి చేసినా అది సభలు, సమావేశాలు మాత్రమే. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ కూడా పెద్దగా తిరగడం లేదంటూ పార్టీకి ఫీడ్‌బ్యాక్ వెళ్లిందట. ఈ ముగ్గురి సంగతి కాస్త పక్కనబెడితే ఉమ్మడి విజయనగరం జిల్లాలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర అందరికన్నా ఎక్కువగా పాల్గొన్నట్టుగా పార్టీ నివేదిక స్పష్టం చేసినట్టు సమాచారం. పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కొంత నయంగానే పాల్గొంటున్నారని తెలిసింది. మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా జగన్ ఫెర్ఫార్మెన్స్ ఇండికేటర్‌లో బొటాబొటిగా పాసయ్యారట. పేరు చెప్పక పోయినప్పటికీ ఒక మాజీ మంత్రి కదలకపోవడంపై జగన్ గుర్రుగానే ఉన్నట్లు చర్చ నడుస్తోంది. పార్టీ నిర్ణయం ప్రకారం ప్రతి ఇంటికీ ఎమ్మెల్యేలు వెళ్లకపోతే సమన్వయకర్త బాధ్యతల నుంచి తప్పిస్తామని హెచ్చరించినప్పటికీ మంత్రులు, మాజీ మంత్రులకు అది వర్తింపజేసే పరిస్థితి ఉండకపోవచ్చని నాయకుల్లో చర్చ నడుస్తోంది. మంత్రుల విషయంలోనూ కఠినంగా వ్యవహరిస్తే బొత్స వంటివారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, అదే పరిస్థితి ఏర్పడితే పార్టీలో డొల్లతనం బయటపడినట్టేనని, అంతదాకా జగన్ తెచ్చుకోరని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. నిత్యం ప్రజల్లో ఉండాలన్న జగన్ నిర్ణయం మంచిదైనప్పటికీ, వయసు, ఆరోగ్యం రీత్యా అంతా ఒకటే మాదిరిగా తిరిగే ప్రసక్తి లేదని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి వచ్చే ఎన్నికల ప్రచారంలోపే ప్రభుత్వంపై ప్రజల అభిమానం, వ్యతిరేకత స్పష్టంగా తెలియాలని, ఈ సందర్భంగా బయటపడ్డ ప్రజానాడితో పార్టీ బలోపేతానికి, ఎన్నికలకు సిద్ధపడాలని అధిష్టానం భావిస్తున్నట్టు తెలుస్తోంది.

పట్టణ పార్కింగ్‌పై దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో పెరుగుతున్న వాహనాలు, వాటి పార్కింగ్‌పై దృష్టి సారించాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం రహదారి భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో అపార్టుమెంట్లు, వాణిజ్య భవనాల నిర్మాణం పటిష్టంగా పర్యవేక్షించాలన్నారు. పట్టణ ప్లానింగ్ పక్కాగా ఉండాలనిస్పష్టం చేశారు. రాష్ట్ర ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న నిర్మాణాలను పరిశీలించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు, గొలుసు దొంగతనాలు, ఇతర విషయాలను పరిశీలించేందుకు సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పట్టణం విస్తరిస్తున్నందున అందుకు అనుగుణంగా అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. రహదారి భద్రతా అవగాహన సదస్సులో మాదక ద్రవ్యాల దుష్ప్రభావాల పైనా అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్‌పి వి.విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ జిల్లాలో 108 బ్లాక్ స్పాట్లు గుర్తించామని, 263 సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, అందులో పార్వతీపురం పట్టణంలో 73 అవసరమని చెప్పారు. పట్టణంలో మొదటి విడతలో కనీసం 25 అవసరం ఉందని ఆయన అన్నారు. జిల్లా రవాణా అధికారి సి.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. జనవరిలో 37 ప్రమాదాలు జరిగాయని, 15మంది మృత్యువాత పడ్డారని ఆయన చెప్పారు. పార్వతీపురం రూరల్, కొమరాడ, సీతానగరం, పాలకొండ, బత్తిలి ప్రాంతంలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన వివరించారు. ఆర్‌అండ్‌బి ఇఇ ఎం.జేమ్స్ మాట్లాడుతూ పార్వతీపురం కొత్తవలస ఫ్లై ఓవర్, ఇతర రహదారులపై ఉన్న గుంతలను త్వరలో మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. రవాణా అసోసియేషన్ అధ్యక్షులు జివి రమణ మాట్లాడుతూ పట్టణానికి బైపాస్ రోడ్డు అవసరమన్నారు. సీతానగరం, కొటిపాం బ్రిడ్జిల పరిస్థితి పరిశీలించాలని కోరారు. మూడు విడతల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని కమిటీ నిర్ణయించింది. కూనేరు వద్ద సమీకృత చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి రవాణా శాఖ నిర్వహించుటకు కమిటీ నిర్ణయించింది. సమావేశంలో జెసి ఒ.ఆనంద్, ఎఎస్‌పి డాక్టర్ దిలీప్ కిరణ్, పాలకొండ డిఎస్‌పి కృష్ణారావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, జిల్లా పరిశ్రమల అధికారి పి.సీతారాము, జిల్లా ప్రజా రవాణా అధికారి టి.వి.ఎస్.సుధాకర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం.వినోద్, మునిసిపల్ కమిషనర్ జె.రామఅప్పల నాయుడు, రవాణా శాఖ అధికారి ఎం.శశి కుమార్, ఇతర రవాణా శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, పక్కన ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు

నేటి నుంచి హైసెక్యూరిటీ నెంబరు ప్లేట్లు అమలు

వాహనాలకు హైసెక్యూరిటీ నెంబరు ప్లేట్లు ఈనెల 16 నుంచి అమర్చుకోవాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. 2013 తర్వాత రిజిస్ట్రేషన్ చేసిన వాహనాలకు విధిగా "హైసెక్యూరిటీ నెంబరు ప్లేట్లు" ఉండాలని స్పష్టం చేశారు. వాహన యజమానులు, వాహన డీలర్లు, ఫైనాన్సియర్లు వాహనం నంబరు ప్లేటు పొందుటకు ముందస్తుగా "ఈ-ప్రగతి" వెబ్ పోర్టల్ (https://aprtacitizen.epragathi.org/#!/Hsrpbookingslot) ఉపయోగించి, వాహన రిజిస్ట్రేషను సంఖ్యను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. నెంబరు ప్లేట్లు అమర్చేందుకు అనుకూలమైన తేదీని, నెంబరు ప్లేట్లు రవాణాశాఖ కార్యాలయం వద్దనా లేక ఇంటివద్దనా అనే విషయాలను పొందుపర్చవచ్చని వివరించారు. ఎంపిక చేసుకున్న తేదీ నాటికి " హై సెక్యూరిటీ నంబరు ప్లేట్లు" తయారుచేసి, బిగింపుకు సిద్ధంగా ఉన్నట్లు సెల్ ఫోన్ కు సందేశం వస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో 2013 తర్వాత రిజిస్టర్ అయిన ప్రతి వాహనదారుడు తమ వాహనాలకు ఈ నెల 25లోగా హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్లను అమర్చుకోవాలని అన్నారు. హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్లపై రవాణా శాఖ తనిఖీలు నిర్వహించి హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్లు లేని వాహనాలకు అపరాధ రుసుం విధించనున్నట్టు స్పష్టం చేశారు.

ముద్రణా సంస్థలు ఎన్నికల నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎన్నికల నిబంధనలను ముద్రణా సంస్థలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రింటింగ్ ప్రెస్ యాజమానులతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కరపత్రాలు, పోస్టర్ల ముద్రణ, ప్రచురణ చేసే ప్రింటింగ్ ప్రెస్ యజమానులు కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. కరపత్రాలు, పోస్టర్ల ముద్రణ, ప్రచురణ చేసే ముందు పోటీలో ఉన్న అభ్యర్థి ఆధార్ కార్డ్, సెల్ఫ్ డిక్లరేషన్, ఇద్దరు సాక్షుల సెల్ఫ్ డిక్లరేషన్‌ను ప్రింటింగ్ ప్రెస్ యజమానులు తప్పనిసరిగా తీసుకోవాలని డిఆర్‌ఒ సూచించారు. మల్టీగ్రాఫ్ ఎన్నికల కరపత్రం, బిల్లు, ప్లకార్డులు, పోస్టర్ ముందు భాగంలో ప్రింటర్ పేరు, చిరునామా తప్పనిసరిగా ఉండాలన్నారు. రాజధానిలో ముద్రించే కరపత్రాలు, పోస్టర్లను ప్రింట్ చేసే యజమాని అభ్యర్థి డిక్లరేషన్, ప్రింట్ చేసిన కరపత్రాలు, పోస్టర్ల కాపీలను ప్రధాన ఎన్నికల అధికారికి వివరాలను సమర్పించాలని తెలిపారు. జిల్లాలో ప్రింట్ చేసే ప్రింటర్లు స్థానిక జిల్లా మేజిస్ట్రేట్‌కు వివరాలను సమర్పించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన ప్రింట్ యజమానికి ఆరు నెలల జైలు, జరిమానా లేదా రెండు విధించబడుతుందని పేర్కొన్నారు. ముద్రించిన కరపత్రాలు, పోస్టర్ల నాలుగు కాపీలను ప్రింటింగ్ యజమాని సెల్ఫ్ డిక్లరేషన్ ను ప్రింట్ చేసిన పది రోజుల్లోపు ప్రధాన ఎన్నిక అధికారి కార్యాలయానికి పంపాలన్నారు. పంపని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రింట్ చేసిన మెటీరియల్ కాపీ, కరపత్రాల కాపీల సంఖ్య, ప్రింటింగ్ ధర వివరాలను ప్రధాన ఎన్నికల అధికారి సూచించిన ప్రొఫార్మాలో ప్రింటర్ సంతకం చేసిన డిక్లరేషన్ అందజేయాలన్నారు. ప్రింటింగ్ ప్రెస్ ద్వారా అందిన ఎన్నికల పోస్టర్లు, కరపత్రాలను జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయాల ఆవరణలో ప్రదర్శిస్తామని తెలిపారు. ప్రధాన ఎన్నికల అధికారి నిర్దేశించిన నిబంధనలను అతిక్రమించిన ప్రింటింగ్ ప్రెస్ యజమానులపై తక్షణ చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. సమావేశంలో కలెక్టరేట్ పరిపాలనా అధికారి ఆర్.ఉమామహేశ్వరరావు, ప్రింటింగ్ ప్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశినాయుడు కుటుంబానికి సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని చెల్లింపేటలో ఏనుగుల దాడిలో మృతి చెందిన అడపా దేశినాయుడు కుటుంబాన్ని సిపిఎం నాయకులు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ గత ఏడేళ్ల నుంచి మన్యం జిల్లాలో ఏనుగులు తిరుగుతూ ప్రజల ప్రాణాలు తీస్తూ, పంటలను ధ్వంసం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు ఏనుగుల గుంపును జూకు గానీ, అడవికి గానీ తరలించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఏనుగుల దాడిలో ఎవరైనా మరణించినప్పుడు, పంట నష్టం జరిగినప్పుడు అధికారులు, నాయకులు హడావిడి చేస్తున్నారే తప్ప, ఆ తర్వాత ఏమీ పట్టించుకోవడంలేదని అన్నారు. మృతి చెందిన దేశినాయుడుతో పాటు కొమరాడ, జియ్యమ్మవలస, భామిని, కురుపాం ప్రాంతాల్లో ఏనుగుల దాడిలో చనిపోయిన వారికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియో, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట నష్టం కూడా తక్షణమే చెల్లించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భవిష్యత్తులో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ఏనుగులను అడవికైనా, జూకైనా తరలించాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో సిపిఎం నాయకులు వి.సత్యంనాయుడు, జి.సత్యనారాయణ, గంట్యాడ బలరాంనాయుడు, పారినాయుడు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, జనసేన నాయకులు సోమనాయుడు తదితరులు ఉన్నారు.

ఏనుగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

కొమరాడ : జిల్లాలో తిష్టవేసిన ఏనుగుల గుంపును శాశ్వతంగా అటవీ ప్రాంతానికి తరలించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక జూనియర్ కళాశాల వద్ద నిరసన తెలిపారు.


మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక మంత్రి ఉన్నప్పటికీ ఏనుగుల విషయంలో అసెంబ్లీలో చర్చించిన పరిస్థితి లేదన్నారు. ఎవరైనా ఏనుగులు వల్ల చనిపోతే ప్రభుత్వం నుంచి రూ. 5లక్షలు నష్టపరిహారం ఇవ్వడమే తప్ప ఆ ఏనుగులు ఏం చేస్తున్నాయి ఎక్కడ ఉన్నాయన్న విషయాన్ని పట్టించుకొనే పరిస్థితి లేదని విమర్శించారు. ఇలా అయితే ఏనుగుల వల్ల ప్రజలకు, రైతులకు భరోసా ఎలా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏనుగులను అడవికైనా, జూకైనా పంపేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో రైతులు గౌరినాయుడు, త్రినాధనాయుడు, పోలినాయుడు, లక్ష్మణరావు, చిన్నంనాయుడు, తాతబాబు, వెంకటనాయుడు, చినబాబు పాల్గొన్నారు.

మద్దతు ధర కల్పించాలని 20న ధర్నా

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన ఉత్పత్తులకు మద్ధతు ధర కల్పించాలని కోరుతూ ఈనెల 20న స్థానిక జిసిసి వద్ద ధర్నా తలపెట్టినట్టు ఎపి గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎ.గంగాధర్ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ గిరిజనులకు రక్షణగా ఉండాల్సిన జిసిసి వారిని భక్షించేలా ఉందని విమర్శించారు. బయట మార్కెట్ కంటే జిసిసి తక్కువ ధరలు ప్రకటించిందని, కిలో చింతపండు రూ.50, పసుపు రూ.100, గ్రేడ్-1 చీపురు రూ.65, గ్రేడ్ రూ.60 చొప్పున కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధరలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 20న తలపెట్టిన ధర్నా ధర్నాలో గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జె.శ్రీరాములు, కైలాష్, సాయి, ప్రకాష్ పాల్గొన్నారు.

సిఐటియులోకి 30 మంది ఆటో కార్మికులు

విజయనగరం: నగరంలోని రాజీవ్ నగర్ కూడలి కాళీమాతా ఆలయం వద్ద 30 మంది ఆటో కార్మికులు సిఐటియులో చేరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, శ్రీ కనకదుర్గ ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు రెడ్డి శంకరరావు సమక్షంలో వీరంతా బుధవారం యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా అక్కడ సిఐటియు జెండాను రెడ్డి శంకరరావు ఎగురవేసి స్టాండ్‌ను ప్రారంభించారు. అనంతరం సురేష్, శంకరరావు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చాక రోడ్ రవాణా చట్టంలో మార్పులు తెచ్చి ఆటో కార్మికులకు ఉరితాడు బిగించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇ-చలానా పేరుతో ఆటో కార్మికులపై విపరీతంగా కేసులు రాస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి రోడ్ రవాణా చట్టంలో మార్పులు రద్దు చేయాలని కోరుతూ ఏప్రిల్ ఐదో తేదిన చలో ఢిల్లీ కార్యక్రమం జరగనుందని, ఇందులో ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నగర అధ్యక్షులు జగన్‌మోహన్, పెయింటర్ల సంఘం అధ్యక్షులు కంది త్రినాథ్, స్టాండ్ ప్రెసిడెంట్, నాయకులు గంగరాజు, పాల్గొన్నారు.

జిసిసి గోదాముల పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎ.సురేష్‌బాబు ఆదేశాలు మేరకు ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం, సిబ్బంది గుమ్మలక్ష్మీపురం మండల స్థాయి స్టాక్‌పాయింట్ తనిఖీలను బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రధాన గోదాముల్లో ఉన్న సరుకుల నిల్వలను, చౌక ధరల దుకాణాలకు, మధ్యాహ్న భోజన పథకాలకు, హాస్టళ్లకు సరుకుల పంపిణీని, పరిశీలించి సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. ప్రతి నెలా జిసిసి డిపోలకు పంపించే సరుకులు సక్రమంగా చేరవేయాలని సూచించారు. అలాగే గిరిజన సంక్షేమ వసతి గృహాలకు కూడా పంపించే సరుకులు సక్రమంగా సమయానపరంగా అందించేలా చూడాలని సూచించారు. ఆయన వెంట జిసిసి, పౌర సరఫరాల అధికారులు, గోదాం ఇంచార్జ్ ఎం.సాంబశివ రావు పాల్గొన్నారు.

జిసిసి గోదామును పరిశీలిస్తున్న ప్రాంతీయ నిఘా, అమలు అధికారి సురేష్‌బాబు

శివరాత్రికి 500 ప్రత్యేక బస్సులు

నెల్లిమర్ల : మహా శివరాత్రి పండుగ పురస్కరించుకొని జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఎపిఎస్‌ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ అన్నారు. బుధవారం ఆమె కొండవెలగాడలోని తన స్వగృహంలో మాట్లాడుతూ జోన్ పరిధిలో 5 జిల్లాలకు గాను ఆయా జిల్లాల్లో పండగ నిమిత్తం ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. విజయనగరం జిల్లాకు 80 బస్సులు, విశాఖపట్నం జిల్లాకు 150 బస్సులు, అనకాపల్లికి 110 బస్సులు, పార్వతీపురం మన్యం జిల్లాకు 70 బస్సులు, శ్రీకాకుళం జిల్లాకు 90 బస్సులు ప్రత్యేక సాధారణ ఛార్జీలతో నడుపుతున్నామని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శైవ క్షేత్రాలను దర్శించుకోవాలని కోరారు. ఈ సంవత్సరం సంక్రాంతి పండుగకు జోనల్ పరిధిలో మంచి ఆదాయం తెచ్చేలా కృషి చేసిన ఆర్‌టిసి అధికారులకు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్‌టిసి ఉద్యోగులకు రావాల్సిన అలవెన్స్, ఎరియల్స్ బకాయిలు అన్నిటిని ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించే దశగా తమ వంతు కృషి చేస్తానని తెలిపారు.

షరా మామూలే

- ఆ కార్యాలయాల ఆవరణ పార్కింగ్ ప్రదేశమే
- తహశీల్దార్ బదిలీ తర్వాత పట్టించుకునే నాథుడేరి?

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ నడిబొడ్డున మూడు ప్రధాన కార్యాలయాల కాంప్లెక్స్ అది. అనునిత్యం వందలాది మంది ప్రజల రాకపోకలు, వాహనాల రద్దీతో సందడిగా ఉండే ప్రాంతమది. ఆరు నెలల క్రితం వరకూ ఆ ప్రదేశాన్ని అప్పటి తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు సుందరవనంలా తీర్చిదిద్దారు. సబ్ ట్రెజరీ, తహశీల్దార్ కార్యాలయాలకు రోజూ పనులపై వచ్చే గ్రామీణ, పట్టణ ప్రజలు తమ వాహనాలను కార్యాలయం ఆవరణలో నిలపకుండా వుండేలా ఆయన కఠినమైన ఆంక్షలు విధించారు. కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు తప్ప ఇతరులెవరూ ద్విచక్ర వాహనాలు గానీ, కార్లు గానీ కార్యాలయ ఆవరణలో పార్కింగ్ చేయరాదని, చేస్తే వాహనాల గాలి తీసేస్తామని హెచ్చరిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. దీనికి సమీపంలో ఉన్న రూరల్ పోలీసులు కూడా సహకరించారు. కార్యాలయాలకు అత్యవసర పనులపై వచ్చే ప్రజలు వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించారు. సివిల్ సప్లయ్ గోడౌన్ వెనుక ఖాళీ స్థలంలో వాహనాల పార్కింగ్ చేయాలని నిర్దేశిస్తూ ఆంక్షలు విధించారు. కార్యాలయం ముందు రోజుకొక విఆర్‌ఎని విధినిర్వహణలో ఉంచి ఆంక్షలు అమలయ్యేలా అప్పటి తహశీల్దార్ చూశారు. ఆయన ఇక్కడ పనిచేసినంతకాలం పనులపై వచ్చే వారు వాహనాల పార్కింగ్ కార్యాలయం వద్ద ఉండేది కాదు. ఆయన బదిలీ అయిన తర్వాత తహశీల్దార్ కార్యాలయ ఆవరణ పార్కింగ్ ప్రదేశంలా తయారైంది. పాతపద్ధతిలోనే రోజూ వందల సంఖ్యలో వాహనాలతో వస్తున్న వారు కార్యాలయం ముందే నిలిపేసి పనులు చక్కబెట్టుకుంటున్నారు. దీనివల్ల రోజూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్ పనులపై కార్లలో వచ్చే వారు, సివిల్ సప్లయ్ గోడౌన్‌కు పిడిఎస్ సరుకులు తీసుకొచ్చి, తీసుకెళ్ళే లారీలు, వ్యానులకు వాహనాల పార్కింగ్ అడ్డంకిగా మారింది. గంటల కొద్దీ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కార్యాలయం ముందు రోడ్డు పైనే వాహనాల పార్కింగ్ చేయడంతో పూర్వపు స్థితి కనిపిస్తోంది. అసలే ఇరుకు ప్రదేశం కావడం, రోజూ వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగించే ప్రదేశం కావడంతో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ఇబ్బందులను పట్టించుకునే నాథుడే లేరని పట్టణ ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.

తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ద్విచక్రవాహనాలు, లారీలు

ముగిసిన ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాలో గత మూడు రోజులుగా జరుతున్న అంతర్ జిల్లాల అర్చరీ చాంపియన్ షిప్ పోటీలు బుధవారం ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ ముఖ్య అతిధిగా పాల్గొని పోటీల్లో గెలుపొందిన విజేతలకు పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులంతా క్రీడా స్ఫూర్తితో పాల్గొనటం సంతోషదాయకం అన్నారు. విజేతలు రానున్న కాలంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఏ పోటీల్లోనైనా గెలుపోటములు సహజమని, ఓడిన వారు నిరుత్సాహపడకుండా క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగితే భవిష్యత్‌లో విజయాలను సొంతం చేసుకుంటారని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు.

ఈ పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో పాల్గొన్న పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన బి.గాయత్రివల్లి మొదటి స్థానం కైవసం చేసుకోగా, చిత్తూరు జిల్లాకు చెందిన కె.సాయి సుజయ, డి.గీతికా రెండు, మూడు స్థానాలను సొంతం చేసుకున్నారు. వైఎస్‌ఆర్ కడప జిల్లాకు చెందిన ఇ.శివదుర్గ నాల్గవ స్థానం దక్కించుకున్నారు. అండర్-14 బాలుర విభాగంలో మొదటి స్థానం విశాఖకు చెందిన ఎస్.రామ్ చైతన్య దక్కించుకోగా, ద్వితీయస్థానంలో పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన జి. వెంకటలోకేశ్, తృతీయ స్థానంలో వైఎస్‌ఆర్ కడప జిల్లాకు చెందిన వై.నవనీష్, నాల్గవ స్థానంలో చిత్తూరు జిల్లాకు చెందిన వై. ధీమంత్ ప్రసాద్ దక్కించుకున్నారు.

అండర్-17 బాలికల విభాగంలో మొదటి స్థానం చిత్తూరు జిల్లాకు చెందిన ఎం.సంజన, ద్వితీయ స్థానంలో వైఎస్‌ఆర్ కడప జిల్లాకు చెందిన కె.దీపికా, తృతీయ స్థానంలో వైఎస్‌ఆర్ కడప జిల్లాకు చెందిన టి.తీర్థప్రియ, నాల్గవ స్థానంలోనూ విజయనగరం జిల్లాకు చెందిన జి.లహరి విజేతలుగా నిలిచారు. అండర్-17 బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో విశాఖజిల్లాకు చెందిన ఆర్.నాగేంద్రబాబు నాయక్, ద్వితీయ స్థానంలో వైఎస్‌ఆర్ కడప జిల్లాకు చెందిన జి.భాస్కర్, తృతీయ స్థానంలో పివిఎస్‌కె భరత్ చిత్తూరు జిల్లా, నాల్గవ స్థానంలో విశాఖ జిల్లాకు చెందిన కె.భరత్ తేజ విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డివి రమణ, క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పి.వెంకటరమణ, గాంధీ, ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పతకాలు, ధ్రువపత్రాలు అందుకున్న క్రీడాకారులు

ప్రజాశక్తి
www.prajasakti.com

దోమల నివారణతో ఫైలేరియా మాయం

ప్రజాశక్తి - బలిజిపేట

మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమలను నివారించుకో గలిగితే ఫైలేరియా బారి నుంచి బయటపడవచ్చునని రాష్ట్ర ఫైలేరియా డిప్యూటీ డైరెక్టర్ రామనాథం అన్నారు. బుధవారం స్థానిక ఆవరణలో ఫైలేరియా నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే ఫైలేరియాను 99శాతం నిర్మూలించవచ్చునని తెలిపారు. వయసును బట్టి డిఇసి, ఆల్బెండజోల్ మాత్రలు వైద్య సలహా మేరకు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఎం.తులశి, సెంట్రల్ టీం మెంబర్ లక్ష్మణ్, కన్సల్టెంట్ సాయి, వైద్యాధికారి యు.మహిపాల్, ఎంపిపి గుడివాడ నాగమణి, ఎంపిడిఒ త్రినాధరావు, సర్పంచ్ బందారు రాగలత, సిహెచ్ఒ ఎస్ఎవ రమణ, హెచ్ఎ సూర్యకుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్: స్థానిక జోగిరాజుపేట బిసి గురుకులంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాధరావు బుధవారం ఫైలేరియా మాత్రలను పంపిణీ చేశారు. 16, 17 తేదీల్లోనూ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం పూర్వ విజయనగరం జిల్లాలో గల 27 పిహెచ్‌సిల పరిధితో సహా 4 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 2 పిపియు యూనిట్ల పరిధిలో 7,01,884 మందికి మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె ప్రాజెక్టు అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎం.వినోద్, ఎస్‌బిసిసి సమన్వయకర్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం: బోదకాలు వ్యాధి నియంత్రణలో భాగంగా రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి పి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డిఇసి మాత్రలు, నులుపురుగులు నివారణలో భాగంగా ఆల్ బెండ్ జోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ వివి శివరామప్ప హాజరై విద్యార్థులకు మాత్రమే మింగించారు. కార్యక్రమంలో ఎటిడబ్ల్యూఒ కె.చంద్రబాబు, ప్రధానోపాధ్యాయులు రామగోవిందం, వార్డెన్ కె.సూర్యనారాయణ, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.నారాయణరావు, పంచాయతీ ఇఒ కె.చంద్రశేఖర్, సూపర్వైజర్ రాధాకృష్ణ ,వైద్య సిబ్బంది, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని సీతానగరం, పెద్ద అంకలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు ఎం రాధాకాంతు ఎన్ ఉషారాణి ఆధ్వర్యంలో ఫైలేరియా, నిలుపురుగు నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ, వాలంటీర్లు పాల్గొన్నారు.

పాచిపెంటలో విద్యార్థులతో డిఇసి మాత్రలను మింగిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

బలిజిపేటలో విద్యార్థులకు డిఇసి మాత్రలను అందజేస్తున్న డిడి రామనాథం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య పరిధిలో గల తాడికొండ, టిక్కబాయి గ్రామాల్లో విద్యార్థులకు, ప్రజలకు బోదకాలు వ్యాధి, నులుపురుగు (ఆల్బెండ్ జోల్) మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు బుద్ధేశ్వరరావు, పైలా అభిలాష్, 104వైద్యులు గుడివాడ ప్రభాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్ఞాన ప్రకాష్, వైద్య సిబ్బంది రత్న ప్రసాద్ శాంతి కాంచన ఉన్నారు.

పాచిపెంట : స్థానిక కెజిబివి హాస్టల్ విద్యార్థులకు ఫైలేరియా నివారణ మాత్రలను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అందజేశారు. వీటి ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. పలు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రవిచంద్ర, పాఠశాల ఎస్ఒ ఉషారాణి, సిహెచ్ఒ శోభారాణి, సూపర్ వైజర్లు పద్మావతి, ఆదిలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు

విలువిద్యలో గుమ్మలక్ష్మీపురం విద్యార్థుల ప్రతిభ

గుమ్మలక్ష్మీపురం : జిల్లా కేంద్రంలో గత ఐదు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విలువిద్య పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న మద్ది శ్రీవల్లి, సుత్తి శ్రీకీర్తిక అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. అండర్-17 విభాగంలో ప్రసన్న, గ్రీష్మలు పతకాలు కైవసం చేసుకున్నారు. గుమ్మలక్ష్మీపురం విద్యార్థులు రెండో స్థానాన్ని కైవసం చేసుకోవడంతో జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం వైకుంఠరావు, కొత్తగూడ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు చంద్ర, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి ఉమారామలింగేశ్వర యాత్ర మహోత్సవాలు

భామిని : మండల కేంద్రమైన భామినిలో శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి యాత్ర మహోత్సవాలు ఈనెల 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ అర్చకులు రంప లలిత ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, యాత్ర మహోత్సవాలకు విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాదాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. యాత్ర మహోత్సవంలో ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భక్తులు ఈ యాత్ర మహోత్సవాలకు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

కేక్ కట్ చేస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి, నాయకులు

ఘనంగా కిశోర్ చంద్రదేవ్ జన్మదిన వేడుకలు

కురుపాం : కేంద్ర మాజీ మంత్రి వి.కిశోర్ చంద్రదేవ్ జన్మదినాన్ని బుధవారం స్థానిక టిడిపి కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర్‌చంద్రదేవ్ విలువలతో కూడిన రాజకీయాలు చేశారని, రాజకీయాల్లో మచ్చలేనటు వంటి మనసున్న గొప్ప వ్యక్తిని కొనియాడారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ కేక్‌ను తాను కట్ చేయడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య, టిడిపి నాయకులు కిమిడి రామరాజు, నందివాడ కృష్ణబాబు, చిలకల వెంకటరావు, కర్రి శ్రీను, విశ్వనాథం, సాయి, శ్రీను పాల్గొన్నారు.

సచివాలయాల పరిశీలన

భామిని : మండలంలోని బాలేరు 1, చిన్నదిమిలి సచివాలయాలను డిఎల్‌డిఒ వివి గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు, సాంకేతిక సమస్యలు, పిఎంజెఎవై, ఎస్‌డిబి సర్వే, సిబ్బంది హాజరు, శానిటేషన్ నిర్వహణ, సచివాలయం శాఖల వారీగా వివిధ అంశాలు, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో బాలేరు ఎంపిటిసి సభ్యులు కొత్తకోట చంద్రశేఖర్, బాలేరు, చిన్నదిమిలి పంచాయతీ కార్యదర్శులు సత్యవతి, పార్వతి, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

మృతురాలు పవిత్ర కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న భూదేవి

విద్యార్థిని కుటుంబానికి భూదేవి పరామర్శ

భామిని : అధికారుల నిర్లక్ష్యం వల్ల సకాలంలో వైద్యం అందక మృతి చెందిన విద్యార్థిని పవిత్రి కుటుంబాన్ని టిడిపి నాయకులు పడాల భూదేవి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ వైద్య సిబ్బంది తమను చులకనగా చూశారని, సరిగ్గా పట్టించుకోకపోవడం వల్లే పవిత్ర మృతి చెందినట్లు భూదేవి వద్ద వాపోయారు. పూతకవలస ఆశ్రమ పాఠశాలలో వారం రోజులు జ్వరంతో బాధపడగా నయంకాకపోవడంతో ఇంటికి పంపించారని, ఆ తర్వాత శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించగా, రెండు వారాల పాటు ఉంచి ఆఖరు క్షణాల్లో విశాఖ రిఫర్ చేశారని అన్నారు. వద్దని ఎంత వేడుకున్నా వినిపించుకోకుండా తరలిస్తుండగా కొద్ది దూరంలో ప్రాణాలు విడిచిందన్నారు. అయినా మరో రోగి కోసమని మృతదేహాన్ని విశాఖ వెళ్లి తిరిగి వచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థుల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

విద్యార్థులకు రక్త పరీక్షలు

వీరఘట్టం : మండలంలోని పివిఆర్ పురం ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం 70మంది విద్యార్థులకు ఎంఎల్‌హెచ్‌పి భార్గవి రక్తపూత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనత తక్కువగా ఉన్న వారికి మందులు పంపిణీ చేసి పలు సూచనలు, సలహాలు అందజేశారు. బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వై.మాణిక్యంతో పాటు వై.జ్యోతి, బొంతు జోగారావు, ముంజేటి మాధవరావు, రఘుమండల ధనుంజయనాయుడు, జెవి ప్రకాష్, హెల్త్ అసిస్టెంట్ పోలినాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

సీతంపేట : మండలంలోని పులిపుట్టి పంచాయతీ పరిధిలో గల రేగులగూడ కాలనీలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రీసోర్స్‌పర్సన్ పాలక నాగేశ్వరావు చిరుధాన్యాల సాగును రైతులకు వివరించారు. గుళిరాగి, లైన్ షోయింగ్ పద్ధతుల ద్వారా సాగు చేస్తే తక్కువ విత్తనాలు, పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చని వివరించారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయంతో కూరగాయలు, వరి పండిస్తే ఆరోగ్యం పొంది ఆర్థికంగా, విద్య పరంగా జీవనాభివృద్ధి చెందవచ్చునని తెలిపారు. అనంతరం జీడి పంటకు సోకే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పులిపుట్టి సర్పంచ్ సవర బాజన్న, డిహెచ్ఒ అమరేశ్వరి, పులిపుట్టి గ్రామ సచివాలయం నుంచి హార్టికల్చర్ ఆఫీసర్ దివాకర్ గారు, రేగులగూడ కాలనీ, పాతరేగులగూడ, వేంపలగూడ నుంచి 32 మంది రైతులు పాల్గొన్నారు.

గిరిజనులకు విముక్తి కల్పించండి

సీతంపేట : ఐటిడిఎ పరిధిలో గల ఏడు మండలాల్లోని ఫారెస్ట్ పరిధిలో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు విముక్తి కలిగేలా చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు పడాల భూదేవి కోరారు. ఈ మేరకు ఆమె బుధవారం స్థానిక తహశీల్దార్ నరసింహమూర్తికి వినతిని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎప్పటినుంచో అటవీశాఖతో ఉన్న వివాదాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే అటవీశాఖ వారు అడ్డంకులు సృష్టించడం వల్ల ఇళ్లు, రోడ్లు నిర్మాణాలు, పోడు వ్యవసాయం వంటి సమస్యలతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ప్రభుత్వం స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వైద్య, ఐసిడిఎస్ సిబ్బంది సమిష్టిగా పనిచేయాలి

ప్రజాశక్తి - కురుపాం

గ్రామాల్లో వైద్యశాఖ, ఐసిడిఎస్ సిబ్బంది కలిసికట్టుగా పనిచేస్తేనే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని ఎంపిడిఒ వివి శివరామప్ప అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కురుపాం, నీలకంఠాపురం, మొండెంఖల్, మాదలింగి, రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల వైద్య అధికారులు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఐసిడిఎస్ సూపర్వైజర్లకు సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది అంగన్వాడి కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల పర్యవేక్షణ, వారికి పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే గ్రామాల్లో ప్రజల ఆరోగ్యాలపై ఎప్పుడూ పర్యవేక్షిస్తూ అందరూ ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు, సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : ప్రజలు వ్యాధుల బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ డొంక త్రినాధులు వైద్యసిబ్బందికి సూచించారు. బుధవారం అన్నవరం పిహెచ్‌సిలో వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు బాధ్యతగా పనిచేయాలన్నారు. వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం చూపరాదన్నారు. సమావేశంలో వైద్యులు పాల్గొన్నారు.

పాలకొండ : విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న రిసోర్స్‌పర్సన్ జయకృష్ణ

లిప్ రాష్ట్ర స్థాయి బృందం పరిశీలన

ప్రజాశక్తి - మక్కువ

లిప్ రాష్ట్ర స్థాయి బృందం మండలంలో బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా శంబర జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించింది. 6,7,8 తరగతుల విద్యార్థులు స్థాయి పరిశీలించారు. బృందంలో రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ చైతన్య, డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీరావు, ఎంఇఒ మల్లేశ్వరరావు, హెడ్మాస్టర్ నారాయణరావు పాల్గొన్నారు.

పాలకొండ:మండలంలోని తంపటాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం స్టేట్ రిసోర్స్‌పర్సన్ ఎస్.జయకృష్ణ, మండల విద్యాశాఖాధికారి సూర్యనారాయణ సందర్శించారు. ఎల్‌పి ప్రోగ్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు పిల్లల్లో ఉన్న సబ్జెక్టుల వారీగా సామర్థ్యాన్ని పరిశీలించారు. మరింత సులభతరమైన బోధన అందించాలని కోరారు.

ఫ్లెక్సీల తొలగింపు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక హనుమాన్ జంక్షన్‌లో ఉన్న వివిధ పార్టీల ఫ్లెక్సీలను తహశీల్దార్ ఎంవి రమణ, ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలను తొలగిస్తామన్నారు. ఎన్నికల నిబంధనలను అన్ని రాజకీయ పార్టీలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, పోలీస్ సిబ్బంది కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఇ- పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని దయానిధి పురంలో రబీ సీజన్ ఇ-పంట నమోదును సూపర్ సిక్‌లో భాగంగా వ్యవసాయ సంచాలకులు డి.లక్ష్మణబాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రామంలో ఎంత మంది రైతులు ఏ ఏ పంటలు వేశారు, ఏఏ సర్వే నెంబర్లలో ఏ పంట వేశారు. ఇ- పంట నమోదు జరిగిందా లేదా అన్న విషయాలను రైతుల వద్ద నుంచి తెలుసుకున్నారు. గ్రామంలో రైతులు వేసిన వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటలు ఎంత విస్తీర్ణంలో వేశారని అడిగి తెలుసుకున్నారు. రైతులంతా ఇ-పంట చేసుకుంటే పంటల బీమా బ్యాంకు నుంచి రుణ సౌకర్యం పొందేందుకు అవకాశం ఉందని, కావున రైతులంతా ఇకెవైసి చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఒ ఎస్ అవినాష్, విఆర్ఒ శ్రీనివాస్, విఎఎ శంకర్, రైతులు పాల్గొన్నారు.

పంట నమోదును పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయాధికారి లక్ష్మణబాబు

అంగన్‌వాడీలపై సచివాలయాల పెత్తనం సరికాదు

ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - పాచిపెంట

అంగన్‌వాడీల బయోమెట్రిక్ నమోదు బాధ్యతను సచివాలయాలకు అప్పజెప్పే లోచనను తక్షణమే విరమించుకోవాలని, అంగన్వాడీలపై సచివాలయాల ఉద్యోగుల పెత్తనం సరైంది కాదని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు టి.ప్రభావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడారు. అంగనవాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, పిల్లలు, బాలింతలకు సచివాలయాల్లో బయోపిక్ వేసే బాధ్యతను అంగన్‌వాడీలకు అప్పగించడం సరైంది కాదన్నారు. దీనివల్ల అంగన్‌వాడీ కార్యర్తలు ఉద్యోగాలు మానుకొని సచివాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బయోమెట్రిక్ పద్ధతి వల్ల లబ్ధిదారులు, అంగన్‌వాడీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కావున పాత పద్ధతిలోనే తల్లులకు, పిల్లలకు, బాలింతలకు పౌష్టికాహారం అందించేలా చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పైడిరాజు, మహిళా సంఘం నాయకులు లక్ష్మి, సిటియు నాయకులు కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

యుటిఎఫ్ సీతంపేట మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- సీతంపేట

యుటిఎఫ్ సీతంపేట మండలశాఖ నూతన కార్యవర్గం బుధవారం ఎన్నికైంది. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కె.సింహాచలం, పాలక కృష్ణారావు ఎన్నికయ్యారు. వీరితో పాటు గౌరవ అధ్యక్షులుగా పి.నారాయుడు, సహాధ్యక్షులుగా ఎ. రామారావు, పిచంద్రకళ, కోశాధికారిగా గణేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వి త్రినాథరావులను ఎన్నుకున్నారు. మండల కార్యదర్శులుగా జె మోహన్ రావు, కె సంధ్యారాణి, హెచ్ కస్తూరి, ఇ సింహాద్రి, కె ఆనందరావు, కాంతారావు, కె అనూష, హెచ్ అశ్వని, కె ప్రసాదరావు, బి అప్పలనాయుడులను, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎ. రామారావు,కె. సింహాచలం, కె.కృష్ణారావు, బి. జయ ప్రకాష్, పి కృష్ణారావు, ఎస్ బాల కుమార్, పి రమేష్, జె రామకష్ణ, బి గాసయ్య, బి వరలక్ష్మి, కె కేశవ, కె ఊర్వశిలను సాంస్కృతిక కమిటీలో మరో ఇద్దరిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరిక భాస్కర రావు వ్యవహరించారు. పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి కె. కృష్ణారావు పాల్గొన్నారు.

కొత్తగా ఎన్నికైన యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గ సభ్యులు

కొత్తచెరువులో కబ్జాలను అరికట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాలిటీ పరిధిలో గల కొత్తవలస, మణికంఠకాలనీ శివారు గల కొత్తచెరువులో కబ్జాలను అరికట్టాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వి.దాలినాయుడు కోరారు. బుధవారం ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘు, సత్య, సింహ చక్రవర్తి, పార్వతీపురం మండల అధ్యక్షులు బలగ శంకర్రావుతో కలిసి కొత్తచెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనెంబర్ 180, 181 గల కలిగిన 3.90 ఎకరాల ఆయకట్టు చెరువును కొంతమందికబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. అందుకే చెరువును పరిశీలించినట్టు తెలిపారు. స్థానికుల మాటల ప్రకారం కొత్తచెరువుపై కబ్జాదారుల కన్ను పడిందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే కొత్తచెరువు కబ్జాలకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

పిల్లలను పనిలో చేర్చుకొంటే చర్యలు

ప్రజాశక్తి - బలిజిపేట

బాలలను పనిలో చేర్చుకొంటే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ హెచ్చరించారు. ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమం దిశ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం బలిజిపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బాల కార్మిక చట్ట ప్రకారం 14 ఏళ్లలోపు పిల్లలను ఎవరైనా పనిలో పెట్టి వారి శ్రమను దోచుకుంటే ఆ యజమానులపై బాల కార్మిక చట్టం కింద కేసులు నమోదు చేస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం స్థానిక దుకాణాలను, ఇటుక బట్టీలను, రైస్ మిల్లులను తనిఖీలు చేశారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక పురవీధుల్లోనూ, పాఠశాల కళాశాలలోనూ విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.

అంగన్వాడీలో అన్నప్రాసన

ప్రజాశక్తి - భామిని

మండలంలోని సోలికిరి అంగన్వాడీ కేంద్రంలో పిల్లలను అన్నప్రసన్నం బుధవారం నిర్వహించారు. ఈవెంట్ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ ద్వారా గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు పిల్లలు పోషణ, పోషణ ప్లస్ అందిస్తున్న ఆహార పదార్థాలు, ఆరోగ్య అంశాలపై అవగాహన కలిగించిన అనంతరం అన్నప్రసన్న కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బాలేరు ఎంపిటిసి కొత్త కోట చంద్రశేఖర్ కుమారుడు మానస్‌కు అన్నప్రసన్నం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ నిర్వాహకులు ఇందుమతి, పద్మ వున్నారు.

రేగిడి ఎంపిపిఎస్ పాఠశాలను ఎంఇఒ పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పాఠ్యాంశాల ప్రణాళిక తప్పనిసరిగా అమలు చేయాలని ఎంఇఒ జె.నారాయణస్వామి సూచించారు. మండలంలోని రేగిడి ఎంపిపిఎస్ పాఠశాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి కనబర్చేలా స్నేహభావంతో విద్యా బోధన చేయాలన్నారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు పరిశీలించారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలన్నారు. అనంతరం విద్యార్థులకు వండి పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాడు-నేడు నిధులతో చేపడుతున్న పాఠశాల భవనాలను పరిశీలించారు.

ఎదురెదురుగా బైకులు ఢీకొని మహిళ మృతి

ఒకరినికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- సాలూరు రూరల్

మండలంలోని అన్నమరాజు వలస పంచాయతీ పరిధిలో గల చీపురు వలస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుమ్మడి ఆదిలక్ష్మి (28) మృతి చెందారు. ఈమె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫిమేల్ నర్సింగ్ అపరేటర్‌గా పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని బుధవారం శంబర నుంచి తన స్వగ్రామమైన కూర్మరాజుపేటకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా చీపురువలస వద్ద ఎదురుగా వస్తున్న గోచక్క పంచాయతీ ఏడికివలసకు చెందిన కొండ గొర్రె నాగేశ్వరరావు బైక్‌పై వచ్చి ఢీ కొన్నాడు. దీంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. స్థానికులు ఆమెను హుటాహుటిన సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మరణించినట్లు పోలీసులు తెలిపారు. నాగేశ్వరరావు పరిస్థితి కూడా విషమంగానే ఉంది.

మృతి చెందిన ఆదిలక్ష్మి

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గుర్ల

మండలం లోని అచ్చుతాపురం వద్ద టాటా మేజిక్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందగా ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు అందించిన వివరాలు మేరకు బుధవారం పాలకొండ దగ్గర కొత్తూరు గ్రామానికి చెందిన పొట్నూరు చంద్ర శేకర్, సీతమ్మ భార్య భర్తలు చీపురుపల్లిలో బస్సు దిగి అక్కడ నుండి విజయనగరం వెళ్ళడానికి చీపురుపల్లిలో టాటా మేజిక్ ఎక్కారు. వీరితో పాటుగా రేగిడి మండలం బురాడ గ్రామానికి చెందిన కొంతమంది ఎక్కారు. అచ్చుతాపురం సెంటర్ తరువాత చింత చెట్టులు వద్దకు వెళ్లేసరికి టాటా మేజిక్ అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో పొట్నూరు చంద్రశేఖర్ (47) ప్రయాణిస్తున్న వాహనంలోనే మృతి చెందారు. మృతుని భార్య సీతమ్మ కాలు విరిగి పోయింది. అందులో ప్రయాణిస్తున్న రేగిడి మండలం బూరాడ గ్రామానికి చెందిన గులివిందల లక్ష్మి, గులివిందల చిలకమ్మకు తీవ్రంగా దెబ్బలు తగలడంతో 108వాహనంలో విజయనగరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన గుర్ల ఎస్ఐ జి. శిరీష్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని అక్కడి బాధితులతో మాట్లాడి క్షతగాత్రులను చికిత్స కోసం దగ్గరుండి ఆసుపత్రికి తరలించారు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ ఢీకొని ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలోని విపిరాజుపేట సమీపాన బుధవారం ముగ్గురు గాయాలపాలయ్యారు. పొలం పనులు చూసుకుని రోడ్డుపైకి వస్తున్న తంపటాపల్లికి చెందిన రంగడు, రాములను వెనుక నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న బలగ పోలీసు ఢీకొనడంతో ముగ్గురుకి గాయాలయ్యారు. స్థానికుల సహాయంతో 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

In the Honourable Court of the 2nd Additional District Judge Parvatipuram O.S. 08/2022

Between:
Baddukonda Adhilakshmi ....Plaintiff
And:
Baddukonda Padmavathi ....Defendant
To.
Baddukonda Padmavathi, W/o late Mohana Rao, D.No. 1-4-6, Kotha valasa, Parvatipuram, Parvatipuram Manyam District

Take notice that the suit filed by the Plaintiff against you for cancellation of the Decree passed in O.S.27/2017 of Honourable 2nd Additional District Judge's Court, Parvatipuram has been posted to **23.02.2023** for your appearance before the above court **at 10.30 am.**

Take notice that if you fail to attend the court on the day above mentioned either in person or through an authorized person, the suit will be heard and determined in your absence.

// By order of the Court//
P. Rajeswara Rao
Advocate PARVATIPURAM
Call 9440510328